సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం, 21, జనవరి, 2024



సొసైటీ పోటీల్లోనూ ద్వితీయమే..

ఉట్నూరులో జరిగిన సొసైటీ క్రీడోత్సవాల్లో భద్రాచలం ఐటీడీఏ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారు.

8లో



క్యాంప్‌లో కౌన్సిలర్లు!

ఇల్లెందు మున్సిపల్ కౌన్సిలర్లు 15 మంది వరకు శుక్రవారం రాత్రి క్యాంపునకు తరలివెళ్లారు.

8లో

గరిష్టం / కనిష్టం
31° / 20°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామివారు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం రామాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. తెల్లవారు జామున సుప్రభాతం పలికిన అర్చకులు ఆరాధన జరిపి నామార్చనలు పఠించారు. కనుల పండువగా అభిషేక జరిపారు. పుణ్యావచనం నిర్వహించి వధూవరుల గోత్రనామాలను పఠించి ప్రవర జరిపారు. అనంతరం కంకణ ధారణ నిర్వహించి కన్యాదానం జరిపి యోక్త్రధారణ చేశారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య నిత్యకల్యాణం నిర్వహించారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్‌కు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–1, 2, 3, 4, ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఆసక్తి ఉన్న ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత సూచించారు. నాలుగు నెలల పాటు కొనసాగే శిక్షణలో స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 08742–227427, 95738 59598, 94419 31359 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భరోసా కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిపై ఉద్యోగాలు

కొత్తగూడెంటౌన్: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేయనున్న భరోసా కేంద్రంపై కాంట్రాక్ట్ పద్ధతిపై మహిళా అభ్యర్థులను నియమించనున్నట్లు ఎస్పీ బి.రోహిత్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని ఒక రిసెప్షనిస్ట్, ఇద్దరు సపోర్ట్ పర్సన్లు, ఒక లీగల్ సపోర్టు పర్సన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఏఎన్‌ఎం) నియమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నియామకం ఏడాది పాటు అమల్లో ఉంటుందని తెలిపారు. పూర్తి సమాచారం కోసం షీటీం ఎస్‌ఐ రమాదేవి(8712682131) సంప్రదించాలని సూచించారు.

నవోదయ పరీక్షకు 1,045 మంది హాజరు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 9 సెంటర్లు ఏర్పాటు చేయగా మొత్తం 1,325 మంది విద్యార్థులకు గానూ 1,045 మంది పరీక్షకు హాజరయ్యారు. 280 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి వివరాలు వెల్లడించారు. డీఈఓ, ఏసీజీఈ ఎస్.మాధవరావు, పాలేరు నవోదయ ఇన్‌చార్జి కె.బ్రహ్మానందరెడ్డి తదితరులు కేంద్రాలను పర్యవేక్షించారు.

ఎట్టకేలకు 'దిశ' సమావేశం

- 25న ఎంపీ కవిత అధ్యక్షతన భేటీ

చుంచుపల్లి: జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ (దిశ) సమావేశానికి ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. ఈ నెల 25న ఐడీఓసీలో ఉదయం 10 గంటలకు దిశ సమావేశం నిర్వహించాలని డీఆర్డీఏ అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశం మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అధ్యక్షతన జరగనుంది. దిశ సమావేశం మూడు నెలలకోసారి నిర్వహించాల్సి ఉండగా, తరచూ వాయిదా వేస్తున్నారు. ఒకవేళ నిర్వహించిన మొక్కుబడిగా పూర్తి చేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో సమావేశం నిర్వహించలేకపోయారు. సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారు హాజరు కావాలి. జిల్లాలో ఏడు సార్లు నిర్వహించిన దిశ సమావేశాలకు ప్రజాప్రతినిధులు నామమాత్రంగానే హాజరయ్యారు. దిశ కమిటీ సభ్యులు, పలు శాఖల అధికారులు మాత్రమే వస్తున్నారు. ఈ సారైనా ప్రజా ప్రతినిధులు, అధికారులందరూ హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై పూర్తిస్థాయిలో చర్చించాలని పలువురు కోరుతున్నారు.

మావోయిస్టుల నజర్!

ఇల్లెందులో పట్టుబడిన జిలెటిన్ స్టిక్స్ ముఠా

- ఛత్తీస్‌గఢ్‌లోని మన కార్మికులపై మావోల కన్ను
- ప్రలోభాలతో సానుభూతిపరులుగా మారుస్తున్న వైనం
- చిన్న మొత్తాల్లో స్థానికంగా పేలుడు పదార్థాల సేకరణ
- చర్చనీయాంశంగా మారిన ఇల్లెందు జిలెటిన్ స్టిక్స్ కేసు



మావోయిస్టు సానుభూతిపరులు, జిలెటిన్ స్టిక్స్ వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణలో వివిధ జిల్లాలకు చెందిన వ్యక్తులకు మావోయిస్టులు తమ భావజాలం ఎక్కించడంతో పాటు ఇతర ప్రలోభాలకు గురి చేయడం ద్వారా సానుభూతిపరులుగా మార్చుకుంటున్న వైనం 'ఇల్లెందు జిలెటిన్ స్టిక్స్' ఘటనతో వెలుగు చూసింది. దీంతో ఇటు ఖాకీ వర్గాలనే కాకుండా అటు సామాన్యులను ఉలిక్కిపడేలా చేసింది.

పక్కాగా నిఘా

గడిచిన దశాబ్ద కాలంగా తెలంగాణలో మావోయిస్టుల ప్రభావం గణనీయంగా తగ్గిపోయింది. అడపాదడపా ఏమైనా సంఘటనలు జరిగినా అవి తెలంగాణతో సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఆ పక్కనే ఉన్న ఒడిశాలో ఉన్న తూర్పు కనుమల్లోని దట్టమైన అడవుల్లోనే చోటు చేసుకున్నాయి. తెలంగాణలో మరోసారి విస్తరించేందుకు మావోయిస్టులు గడిచిన పదేళ్లుగా ప్రయత్నాలు చేస్తుండగా, ఇక్కడి పోలీసులు గట్టిగా తిప్పికొడుతున్నారు. ఈ విషయంలో జిల్లా పోలీసు విభాగం అగ్రభాగంలో నిలిచింది. పకడ్బందీ నిఘా వ్యవస్థ సాయంతో మావోలకు పట్టు చిక్కనివ్వడం లేదు. ఎక్కడికక్కడ సానుభూతిపరులను అదుపులోకి తీసుకోవడం, లొంగిపోయేలా చేస్తూ మావోయిస్టులపై పైచేయి సాధించారు. దీంతో జిల్లాలో దళాలు సంచరించే పరిస్థితి లేకుండా చేశారు.

ప్రకటనలకే పరిమితం

పోలీసు వ్యవస్థ సమర్థంగా పని చేయడంతో గడిచిన రెండేళ్లుగా మావోయిస్టులు ప్రకటనలకే పరిమితమయ్యారు. అల్లూరి సీతారామారాజు, భద్రాద్రి జిల్లా, ములుగు జిల్లా, మంచిర్యాల జిల్లా, శబరి ఏరియా, ఇల్లెందు – నర్సంపేట ఏరియా, కోల్‌బెల్ట్ ఏరియా, తెలంగాణ రాష్ట్ర కమిటీల పేరుతో క్రమం తప్పకుండా వివిధ అంశాలపై ప్రకటనలు తప్ప పెద్దగా కార్యకలాపాలు చేయలేని విధంగా నిఘాను కట్టుదిట్టం చేశారు. కేవలం చర్ల, దుమ్ముగూడెం మండలాల పరిధిలో వాల్ పోస్టర్లు అంటించడం, బ్యానర్లు ఏర్పాటు చేయడం వరకే మావోయిస్టులు, వారి సానుభూతిపరులను పోలీసులు కట్టడి చేశారు. చర్ల – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పదుల సంఖ్యలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను నిర్వీర్యం చేయగలిగారు. ఇటీవల ఎన్నికలు లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేసిన మందుపాతరను గుర్తించి, ఎటువంటి ప్రమాదం లేకుండా పేల్చి వేశారు. ఇలా అన్ని విధాలుగా మావోయిస్టులు జిల్లాలో పాదం మోపలేని పరిస్థితిని ఖాకీలు కల్పించారు.

లోతైన విచారణ

గతంలో ఛతీస్‌గఢ్‌లో వివిధ సంతలకు వెళ్లే వ్యాపారులను మావోయిస్టులు టార్గెట్ చేయగా వెంటనే పోలీసులు అప్రమత్తమై ఈ వ్యూహాన్ని తిప్పికొట్టారు. దీంతో వ్యాపారులను పక్కన పెట్టి ఉపాధి కోసం వెళ్తున్న వారిలో కొందరిని మావోయిస్టులు టార్గెట్ చేస్తున్నారనేది తాజా ఉదంతం తెలియజేస్తోంది. అయితే జిలెటిన్ స్టిక్స్ ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు ? ఎవరెవరు సహకారం అందిస్తున్నారు ? తరలించే మార్గాలు ఏవీ ? ఈ విషయంలో మావోయిస్టులు ఎంత మేరకు విజయం సాధించారు? తదితర అంశాలపై పోలీసు వర్గాలు లోతైన విచారణ మొదలుపెట్టాయి. మొత్తానికి మావోయిస్టుల ప్రభావం తీవ్రంగా ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశాలతో సమీప సరిహద్దును పంచుకుంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరోసారి జనతన సర్కార్ సానుభూతిపరులు చర్చనీయాంశంగా మారారు.

టార్గెట్ మారింది

పోలీసు నిఘా గట్టిగా ఉండటంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రా – ఒడిశా సరిహద్దు నుంచి గంజాయిని తెలంగాణలోకి తీసుకురావడం అక్రమార్కులకు కత్తి మీద సవాల్‌గా మారింది. జిల్లాలో రోజుకు ఏదో ఒక మూలన గంజాయి అక్రమంగా తరలిస్తూ పట్టుబడటం పరిపాటిగా మారింది. అటు వైపు నుంచి ఇటు వైపు మావోయిజం రాకుండా అడ్డుకట్ట వేయడంలో విజయవంతం అయ్యారు. అయితే తాజా ఘటనతో మావోయిస్టుల మరో వ్యూహం బయటపడినట్లయింది. మావోయిస్టులు పేలుడు పదార్థాల కోసం తెలంగాణపై ఆధారపడుతున్నారనే అంశం తెర మీదకు వచ్చింది. వివిధ పనుల నిమిత్తం ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు వెళ్తున్న వారిని మావోయిస్టులు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. కుదిరితే భావజాలంతో ఆకర్షించడం లేదంటే ప్రలోభాలతో ఆకట్టుకోవడం చేస్తూ తమ అవసరాలు తీర్చుకుంటున్నారనే అంశం 'ఇల్లెందు జిలెటిన్ స్టిక్స్ కేసు'తో బహిర్గతమైంది.

బాలల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బాలల సంరక్షణకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చైల్డ్‌కేర్ ప్లాన్ కింద మూడు నెలలకోసారి పిల్లల ఆరోగ్యం, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏడుగురు బాల కార్మికులను రక్షించి బాలసదన్‌కు తరలించామని పేర్కొన్నారు. మహిళా సంక్షేమాధికారి విజేత మాట్లాడుతూ జిల్లా నుంచి ఇప్పటివరకు ఇటలీకి ఇద్దరు, అమెరికాకు ఇద్దరు, ఇతర దేశాలకు 17మంది పిల్లలను కలెక్టర్ ఆధ్వర్యంలో దత్తత ఇచ్చినట్లు తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య స్కీమ్ ద్వారా రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో 714 మందికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థికసాయం అందించామన్నారు. ఏఎస్పీ విజయ్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సంజీవరావు, డీసీపీఓ ఎం.హరికుమారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవి, సుమిత్ర పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్(పా)గా శ్రీనివాస్



ఎన్వీకే శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా)గా డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే.శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సీఎండీ ఎస్.బలరామ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 1983లో శ్రీనివాస్ ఎంజీటీగా బాధ్యతలు చేపట్టి వివిధ హోదాల్లో పనిచేస్తూ 2019లో జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. 2023 ఫిబ్రవరి 1న డైరెక్టర్ (ఆపరేషన్స్)గా నియమితులైన ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో డైరెక్టర్ (పా)గా పదోన్నతి లభించింది. గతంలో డైరెక్టర్(పా) అదనపు బాధ్యతలు నిర్వర్తించిన బలరామ్ ఈనెల 3న సీఎండీగా నియమితులు కావడంతో ఆ బాధ్యతలు శ్రీనివాస్‌కు అప్పగించారు.

జంతువులను కాపాడాలి

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పురంధర్



మాట్లాడుతున్న డాక్టర్ పురంధర్

సుజాతనగర్: జంతు సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పురంధర్ అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని సింగభూపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను హింసించకుండా చూడాలని, వాటి హక్కులను కాపాడాలని సూచించారు. పశువులను గాయపరిచినా, హాని చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులకు జంతు సంక్షేమంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు, పాఠశాల ఉపాధ్యాయులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

అదనపు కలెక్టర్ రాంబాబు



ఊట్లపల్లిలో దరఖాస్తు ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట/ములకలపల్లి : 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం ఆయన అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లోని ఊట్లపల్లి, నారాయణపురం, మల్కారం, లచ్చాపురం, వీకే రామవరం, పూసుగూడెం, సర్వాపురం, జగన్నాథపురం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. తప్పులులేని ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. కుటుంబ సభ్యుల నుంచి ఫారం 7 ద్వారా దరఖాస్తులు తీసుకుని మృతుల పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. తహసీల్దార్లు వి.కృష్ణప్రసాద్, గుడ్ల పుల్లారావు, ముజాహిద్, డీటీ రామకృష్ణ, ఆర్‌ఐలు తారాచంద్, వెంకటేశ్వర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఉద్యోగులను భాగస్వామ్యం చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): గనుల్లో చేపట్టే రక్షణ చర్యల్లో ఉద్యోగులను భాగస్వామ్యం చేయాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, సత్యనారాయణరావు సూచించారు. శనివారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఇల్లెందు గెస్ట్ హౌస్‌లో జరిగిన సేఫ్టీ రివ్యూ సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని ఏరియాల్లో భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. కార్మికులకు అవగాహన పెంచితేనే ప్రమాదాలులేని సింగరేణిగా చూడగలుగుతామని పేర్కొన్నారు. అనంతరం త్వరలో పదవీ విరమణ పొందనున్న కొత్తగూడెం, రామగుండం రీజియన్ల సేఫ్టీ జీఎంలు జే. కుమారస్వామి, ఎస్.సాంబయ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గురవయ్య, కేహెచ్‌ఎన్ గుప్తా, నాగేశ్వరరావు, వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లు, వర్క్‌షాపుల అధికారులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల
- పాత పాల్వంచలో పోలింగ్ కేంద్రం తనిఖీ



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ: పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. శనివారం పాత పాల్వంచ జెడ్పీ హైస్కూల్, మండల ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 21న ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపునకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. శనివారం 1,095 పోలింగ్ కేంద్రాల్లో ఫారం 6కు 519, ఫారం 7కు 155, ఫారం 8కు 233 చొప్పున మొత్తం 897 దరఖాస్తులు వచ్చాయన్నారు. వచ్చి ప్రతీ దరఖాస్తును జాగ్రత్తగా భద్రపరచాలని సిబ్బందికి సూచించారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

పాల్వంచ మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, తహసీల్దార్ నాగరాజులతో కలిసి అయ్యప్పనగర్, శ్రీనివాసకాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలన్నారు. నీటి నిల్వల వల్ల దోమల వ్యాప్తి జరుగుతుందన్నారు. స్వచ్ఛ ఆటోలు అన్ని ఏరియాలకు వెళ్లేలా చూడాలన్నారు. కొత్తగూడెం ఆర్డీఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంపై అవగాహన అవసరం

- స్టేట్ ఆడిట్ శాఖ డీడీ వీఆర్.తూములూరి
- కొత్తగూడెంలో ముగిసిన కథా, కవితా కార్యశాల



బహుమతులు అందుకున్న వారితో నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: విద్యార్థి దశ నుంచే సాహిత్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని.. తద్వారా భవిష్యత్‌లో మంచి రచనలు వెలువడతాయని కవి, స్టేట్ ఆడిట్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ వీ.ఆర్ తూములూరి తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో బాలోత్సవ్ ఆధ్వర్యాన రెండు రోజులుగా కథా, కవితా కార్యశాల శనివారం ముగిసింది. ఈసందర్భంగా బాలోత్సవ్ జాతీయ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో వీఆర్.తూములూరి మాట్లాడుతూ కథా, కవితా కార్యశాల ఏర్పాటుతో విద్యార్థుల్లో సాహిత్యాభిలాష పెంపొందించడం అభినందనీయమని తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లా నుంచి 500 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా ప్రముఖ కవులు, రచయితలు పాల్గొని రచనలపై అవగాహన కల్పించారు. అలాగే, శనివారం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కిలారి స్వర్ణ, కోట్టం రామకృష్ణారెడ్డి, ఎలియా మన్నె, అనిల్‌డ్యానీ, కోనూరి రవికుమార్, డాక్టర్ కటుకోజ్వల రమేష్, భగవంతంతో పాటు వెంకట్రావు, మల్సూర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విజేతలు వీరే...

కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన కథా కవితా, కార్యశాల పోటీల్లో విద్యార్థులు 200కు పైగా కథలు, కవితలను రాసి ప్రతిభ చాటుకున్నారు. 'రంగుల కల' అంశంపై 120 మంది విద్యార్థులు కవితలు రచించగా జి.మౌనశ్రీ(కేటీపీఎస్), బి.వివేక్(నవభారత్), జె.రాజేశ్వరి(పాల్వంచ) మొదటి మూడు బహుమతులు గెలుచుకోగా, జి.భూమిశ్రీ(హేమచంద్రాపురం), కె.ధరణి(నవభారత్)కు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. అలాగే, కథల పోటీల్లో శ్రీవల్లి(పాల్వంచ), తోట అజయ్‌కుమార్(తల్లాడ), బి.లహరి(అశ్వాపురం) మొదటి మూడు స్థానాల్లో నిలవగా ఎండీ.సుహానా(రుద్రంపూర్), వి.రమ్య(అన్నపురెడ్డిపల్లి) కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు.

పేరుకే జెడ్పీ చైర్మన్ గిరీ!

వాహనం, గన్‌మెన్ల కేటాయింపులో తాత్సారం



వినియోగంలో లేని చైర్మన్ వాహనం

చుంచుపల్లి: గత నెలలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య స్థానంలో బాధ్యతలు తీసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావుకు ప్రభుత్వ వాహనంతో పాటు గన్‌మెన్లను కేటాయించడంలో జాప్యం జరుగుతోంది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జెడ్పీ చైర్మన్ రాజీనామా చేస్తే ఆ స్థానంలో వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగిస్తారు. అందులో భాగంగా చైర్మన్ కనకయ్య ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలవడంతో డిసెంబర్ 8న రాజీనామా చేయగా, 9న వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. ఆ వెంటనే ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయనకు వాహనంతో పాటు గన్‌మెన్లను కేటాయించాల్సి ఉంది. కానీ కంచర్ల బాధ్యతలు స్వీకరించి 40 రోజులు కావొస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. రాజకీయ కారణాలతోనే ఇలా చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఈ అంశంపై జెడ్పీ అధికారులను సంప్రదించగా నిబంధనల మేరకు తాము వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావుకు చైర్మన్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ప్రభుత్వ వాహనం, గన్‌మెన్ల కేటాయింపు విషయమై ఉన్నతాధికారులకు నివేదించామని పేర్కొన్నారు.

బడిలో ఎన్నికల వేడి!

- పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల షెడ్యూల్ విడుదల
- 29న జిల్లా వ్యాప్తంగా 1,065 పాఠశాలల్లో ఓటింగ్
- అదే రోజు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక, సమావేశం



చల్లసముద్రం ఉన్నత పాఠశాల

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల గంట మోగింది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)లను ఎన్నుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. 2009 నుంచి ఎస్‌ఎంసీలను ఎన్నుకుంటున్నారు. చివరిసారిగా 2019 నవంబర్ 30న ఎన్నికలు నిర్వహించగా, వారి పదవీకాలం 2021 నవంబర్ 29తో ముగిసింది. ఆ సమయంలో కరోనా కారణంగా ఎన్నికలను అప్పటి ప్రభుత్వం వాయిదా వేసింది. అప్పటి నుంచి ప్రతి ఆరు నెలలకోసారి ఈ ఎన్నికలను వాయిదా వేస్తున్నారు.

1,065 పాఠశాలల్లో

జిల్లాలో మొత్తం 1,065 జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, యూఆర్‌ఎస్ (అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్), ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే ఓటు హక్కు కల్పిస్తారు.

కమిటీ ఏర్పాటు నిబంధన

కమిటీల్లో పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు, ఉపాధ్యాయులు, పంచాయతీరాజ్ సంస్థలకు ప్రజలచే ఎన్నికైన ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉండాలి. కమిటీ సభ్యులలో నాలుగింట మూడు వంతుల మంది తల్లిదండ్రులు, సంరక్షకులుండాలి. తల్లిదండ్రుల సభ్యుల్లో మూడింట రెండొంతుల మందికి తగ్గకుండా మహిళలు ఉండాలి.

ఇవీ బాధ్యతలు

పాఠశాల పనితీరు అజమాయిషీ చేయాలి. పనులను సక్రమంగా జరిగేలా, ప్రభుత్వ నిధులు సక్రమంగా వినియోగపడేలా చూస్తారు. అభివృద్ధి ప్రణాళిక తయారీ, బడిబయట పిల్లలను బడిలో చేర్పించడం, పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య, తరగతి గదులు, తాగునీరు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, వంటగది, ప్రహరీ, విద్యుత్ సౌకర్యం, ఆట స్థలం, క్రీడాపరికరాలు, గ్రంథాలయం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందేలా కమిటీ బాధ్యులు పర్యవేక్షిస్తారు. పాఠశాలకు మంజూరయ్యే నిధులను కమిటీ అధ్యక్షుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఉమ్మడి ఖాతాలోనే జమచేస్తారు. ఖాతా నుంచి డబ్బు తీసుకునే చెక్కులపై అధ్యక్షుడితోపాటు ప్రధానోపాధ్యాయుడు సంతకం చేయాల్సి ఉంటుంది.

నిజాయితీపరులను ఎన్నుకుంటే..

గతంలో పాఠశాల యాజమాన్య కమిటీలో అనేక లోటుపాట్లు వెలుగుచూశాయి. ముఖ్యంగా రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఉన్న తల్లిదండ్రులనే చైర్మన్లుగా ఎన్నుకున్నారు. దీంతో కొన్ని పాఠశాలల్లో ఏం చేసినా అడిగేవారు లేకుండా పోయారు. దీంతో సమావేశాలు జరపకపోవడం, మధ్యాహ్నభోజనం నిధుల్లో అవకతవకలు, ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. కాగా ఈసారైనా తల్లిదండ్రులు ప్రశ్నించేతత్వం ఉన్న, నిజాయితీపరులను ఎన్నుకుంటే విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ అందే అవకాశం ఉంటుంది.

షెడ్యూల్ ఇలా..

ఈ నెల 29న ఎన్నికలు జరగనున్నాయి. శనివారం అన్ని పాఠశాలల్లో ఓటర్ల జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. 22, 23 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి, 24న తల్లిదండ్రుల తుది జాబితాను ప్రకటిస్తారు. 29న ఎన్నికలు నిర్వహిస్తారు. ఓటర్ల జాబితాలోని తల్లి గానీ, తండ్రి గానీ, సంరక్షకుడు కానీ ఒకరే ఓటుకు అర్హులు. ఓటర్లలో యాభైశాతం హాజరుకాకుంటే కోరం లేనట్లుగా అధికారులు ప్రకటిస్తారు. ముందుగా సభ్యులను చేతులెత్తే పద్ధతి లేదా మూజువాణి ఓటుతో కమిటీని ఎన్నుకుంటారు. లేనిపక్షంలో తప్పనిసరి పరిస్థితిలో రహస్య బ్యాలెట్ పద్ధతిన ఓటింగ్ నిర్వహిస్తారు. ఒక వేళ విద్యార్థి పాఠశాల వీడితే తల్లిదండ్రులు కూడా ఎస్‌ఎంసీ బాధ్యతలను కోల్పోతారు. 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహించి, 1:30 గంటలకు విజేతలను ప్రకటిస్తారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 2 గంటలకు ఎస్‌ఎంసీ ప్రథమ సమావేశం నిర్వహిస్తారు.

క్లుప్తంగా

రామయ్యకు బంగారు హారం



ఈఓ రమాదేవికి హారం అందజేస్తున్న దాతలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి హైదరాబాద్‌కు చెందిన ఆకెళ్ల శ్రీనివాస్ ప్రదీప్ శనివారం బంగారు హారం సమర్పించారు. 35 గ్రాముల ఈ హారం విలువ రూ.2,39,429 ఉంటుందని అంచనా. ఈ మేరకు ప్రధానాలయం, ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు హారాన్ని ఈఓ రమాదేవికి అందజేశారు.

అండర్-14 క్రికెట్ జట్టులో జిల్లా వాసులు



మాట్లాడుతున్న క్రికెట్ అకాడమీ నిర్వాహకులు, కోచ్‌లు

భద్రాచలంఅర్బన్: అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఇద్దరు జిల్లావాసులు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో అండర్-14 క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు 5000 మంది క్రీడాకారులు హాజరు కాగా వారిలో 170 మందిని ఎంపిక చేసి, 10 జట్లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయగా.. అందులో భద్రాచలానికి చెందిన బెస్ట్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు ఎస్.గురువిద్వాన్‌మణికంఠ, కె.మాన్విత్ ఉన్నారని కోచ్‌లు తేజ, లల్లు, బుజ్జి శనివారం వెల్లడించారు. రాష్ట్రంలో ఏ జిల్లాకు దక్కని అవకాశం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు దక్కిందని, ఒకే జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కావడం హర్షణీయమని బెస్ట్ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు, కోచ్‌లు పేర్కొన్నారు. కాగా, అండర్-14 జట్టు జనవరి చివరి వారంలో గోవాలో జరగబోయే సౌత్ జోన్ టోర్నీలో పాల్గొననుంది.

పుట్టినరోజు వేడుకలపై కౌన్సెలింగ్

పాల్వంచరూరల్: ఓ ఇంజనీరింగ్ విద్యార్థి పుట్టినరోజును పురస్కరించుకుని దాబా హోటల్‌లో డీజే సౌండ్ బాగా పెట్టి వేడుకలు చేసుకుంటుండగా ఎస్‌ఐ బి.శ్రీనివాస్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలోని పునుకుల గ్రామ సమీపంలోని రహదారి పక్కన గల హోటల్‌లో ఓ విద్యార్థి తన పుట్టినరోజు సందర్భంగా తోటి విద్యార్థులతో కలిసి వేడుకలు నిర్వహిస్తున్నాడు. డీజే సౌండ్ విపరీతంగా పెట్టి, మద్యం సేవిస్తూ నృత్యాలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

26న రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, తదితరులు

ఇల్లెందు: ఇల్లెందులోని జేకే సింగరేణి స్కూల్ మైదానంలో ఈ నెల 26న రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డ్యాన్స్ అసోసియేషన్, బ్లూ మూన్స్ డ్యాన్స్ స్టూడియో మాస్టర్ పాదిలి శ్యామ్ తెలిపారు. ఈ పోటీల పోస్టర్లను శనివారం ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వర రావు ఆవిష్కరించారు. అనంతరం శ్యామ్ మాట్లాడుతూ.. వివిధ విభాగాల్లో జరిగే పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 99493 97834 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముద్రగడ వంశీ, మడుగు సాంబమూర్తి, సూర్యం, శ్రీను, చాందావత్ రమేశ్‌బాబు, పింగిళి నరేశ్, హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా మట్టి తోడి, రవాణా చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దురదపాడు గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని జేసీబీతో తొవ్వి, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎర్రయ్య ఘటనా స్థలానికి వెళ్లి జేసీబీ, ట్రాక్టర్లను తహసల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు. తహసీల్దార్ ముజాహిద్‌ను వివరణ కోరగా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బోర్ యంత్రం..

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ నెహ్రూనగర్ శివారు అటవీ ప్రాంతంలో బోర్ వేస్తున్న యంత్రాన్ని అటవీశాఖ అధికారులు శనివారం సీజ్ చేశారు. నెహ్రూనగర్‌కు చెందిన రైతులు ప్రభుత్వం పట్టా లిచ్చిన పోడుభూముల్లో బోరు వేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వర రావు సిబ్బందితో వెళ్లి బోర్ యంత్రాన్ని స్వాధీనం చేసుకొని కలపయార్డుకు తరలించారు.

క్యాంప్‌లో కౌన్సిలర్లు!



క్యాంపునకు తరలివెళ్లిన 15 మంది కౌన్సిలర్లు (ఫైల్)

- నోటీస్ అందుకున్న రోజు రాత్రే 15 మంది తరలింపు
- వెళ్లేందుకు మరో నలుగురు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం
- ఫిబ్రవరి 5న ఇల్లెందు మున్సిపాలిటీలో బలపరీక్ష

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కౌన్సిలర్లు 15 మంది వరకు రాత్రికి రాత్రే క్యాంపునకు తరలి వెళ్లారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావుపై అవిశ్వాసం పెట్టేందుకు వచ్చే నెల 5న ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల నుంచి శుక్రవారం ఆదేశాలు అందాయి. దీంతో అదేరోజు రాత్రే కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. అక్కడి నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు గోవా లేదా ఆంధ్రాకు తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఏడాది నుంచి అసమ్మతి..

ఏడాదికాలంగా మున్సిపల్ పాలకవర్గంలో అసమ్మతి జ్వాలలు రగులుతున్నాయి. పాలకవర్గంలో 24 మంది సభ్యులు ఉండగా, 19 మంది అవిశ్వాసం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు నోటీస్ అందజేశారు. అవిశ్వాసం ప్రకటిస్తున్న మెజారిటీ సభ్యులు బీఆర్ఎస్ వైపు ఉండగా, చైర్మన్ వెంకటేశ్వరరావు వెంట ఉన్నవారి సంఖ్య తక్కువగా ఉంది. ఏడాది కాలంగా ఒక్కో కౌన్సిలర్ జారి పోతున్నా చైర్మన్ చక్కదిద్దుకోలేకపోయారు. ఆర్థికంగా బలంగా ఉన్న గణేష్ అనే వ్యక్తి అన్ని అవకాశాలనూ వినియోగించుకుంటూ అసమ్మతి వ్యవహారాన్ని నడుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కౌన్సిలర్లు క్యాంపునకు తరలి వెళ్లిన సమస్య కాంగ్రెస్‌కు కొరకరాని కొయ్యగా మారింది. అసమ్మతి కౌన్సిలర్లు క్యాంపు రాజకీయం చేస్తుండటంతో ఎదుర్కొనేందుకు అధికార కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నమైంది. అటు క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు, ఇటు ఇల్లెందులో క్యాంపు ఆఫీస్ చుట్టూ తిరుగుతున్న కౌన్సిలర్లతో కాంగ్రెస్ పెద్దలు సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. సమస్య పరిష్కారానికి సామరస్య వాతావరణం కల్పించేందుకు కోసం కృషి చేస్తున్నారు.

బంపర్ ఆఫర్

మున్సిపల్ పాలకవర్గ మెజారిటీ సభ్యులు అవిశ్వాసానికి సహకరిస్తే అందుకు ప్రతిఫలంగా కౌన్సిలర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించినట్లు తెలిసింది. ఒక్కో కౌన్సిలర్‌కు రూ.20 లక్షలు ఇవ్వజూపినట్లు సమాచారం. ఈ క్రమంలో అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికే సభ్యుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

అనుమతి లేకుండా నిర్మాణాలు..

కలెక్టర్ ఆదేశాలతో పనుల నిలిపివేత



విద్యానగర్‌లో భవన యజమానికి నోటీసులు ఇస్తున్న అధికారులు

చుంచుపల్లి: విద్యానగర్ కాలనీ, బాబూ క్యాంపు, ఎన్‌కే.నగర్ పంచాయతీల పరిధిలో అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా 200, 300 గజాల స్థలాల్లో నాలుగైదు అంతస్తులు నిర్మిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ ప్రియాంక ఆలకు ఫిర్యాదులు అందటంతో ఆమె ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ అధికారులు శనివారం రంగంలోకి దిగారు. బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తూ అనుమతి లేని నిర్మాణాలను నిలిపివేయించారు. విద్యానగర్‌లోని బైపాస్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో అనుమతులు లేని పది భవన నిర్మాణాలను అడ్డుకున్నారు. అయితే, నిర్మాణం మొదలుపెట్టినప్పుడే అడ్డుకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని.. ఇకనైనా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీఓ గుంటి సత్యనారాయణను సంప్రదించగా కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు అనుమతి లేని భవన నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి పనులు నిలిపివేయించామని తెలిపారు. తనిఖీల్లో ఉద్యోగులు బొంతు బాబూరావు, రవికుమార్, కిశోర్, అమర్ తదితరులు ఉన్నారు.

ఇసుక లారీని పట్టుకున్న గ్రామస్తులు



ఇసుకను సీజ్ చేస్తున్న ఆర్ఐ ఆదినారాయణ

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాలకు అక్రమంగా ఇసుక తోలుతున్న లారీని గ్రామస్థులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. చర్ల మండలం కొత్తపల్లి ఇసుక ర్యాంపు నుంచి సత్తుపల్లిలో అన్‌లోడింగ్ చేయాల్సిన ఇసుక శనివారం ఏకలవ్య పాఠశాల దగ్గర అన్‌లోడింగ్ చేస్తుండగా గ్రామస్థులు పట్టుకున్నారు. ఒకే వే బిల్లుపై మూడు సార్లు ఇసుక తోలకాలు జరుగుతున్నా.. సంబంధిత టీఎస్ఎండీసీ మైనింగ్ అధికారుల ప్రమేయం లేకుండా జరిగే అవకాశం ఉంటుందా? అని గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. అంతేకాక ఇసుక ర్యాంప్‌ల దగ్గర ఎలాంటి పర్యవేక్షణ చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చర్ల నుంచి సత్తుపల్లికి వెళ్లాల్సిన ఇసుకను మధ్యలోని దుమ్ముగూడెం మండలంలో అన్‌లోడింగ్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. రెండు రోజుల నుంచి ఇలాగే ఇసుక రవాణా జరుగుతోందని, అనుమానం వచ్చి లారీని నిలిపివేయగా అసలు విషయం బయటపడిందని గ్రామస్థులు చెబుతున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

ఇసుక సీజ్..

సీతారాంపురం ఏకలవ్య పాఠశాల దగ్గర అక్రమంగా నిల్వ ఉంచిన మూడు లారీల ఇసుకను ఆర్ఐ ఆదినారాయణ సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసి గ్రామస్తుల సమక్షంలో పంచనామా నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ జయపాల్‌రెడ్డి

కొత్తగూడెంటౌన్: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని, ప్రమాదాల నివారణలో తమవంతు పాత్ర పోషించాలని జిల్లా రవాణా శాఖ అధికారి జయపాల్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెం పట్టణ పరిధిలో ఆయన ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయపాల్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేగంగా వెళ్లకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

అశ్వారావుపేటరూరల్: పార్కింగ్ చేసి ఉన్న ఓ ద్విచక్రవాహనం చోరీకి గురైంది. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం మేరకు.. అశ్వారావుపేటలోని పోస్టాఫీస్ బజార్‌కు చెందిన కొండా కన్నయ్య ఈ నెల 17వ తేదీన తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు పార్కింగ్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. బాధితుడు శనివారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీల నిందితులు అరెస్ట్

దుమ్ముగూడెం: మండలంలో వరుసగా చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దోమల రమేశ్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ కేశవరావు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ధాన్యం బస్తాతో వస్తూ పోలీసులను చూసి పారిపోబోయాడు. పోలీసులు వెంబడించి పట్టుకుని, విచారించగా.. అతడి పేరు బొర్రా కార్తీక్.. మంగువాయిబడువ గ్రామంగా చెప్పాడు. ఈ నెల 15వ తేదీన పర్ణశాల గ్రామంలో తాటిపూడి రమేశ్‌కు చెందిన వడ్లను చోరీ చేసింది తానేనని ఒప్పుకొన్నాడు. అదే గ్రామానికి చెందిన కల్లూరి జంపన్న, తూర్రం రమేశ్, కల్లూరి సమ్మయ్య, సాయికృష్ణతో కలిసి మండలంలో లక్ష్మీనగరం, కేశవపట్నం గ్రామాల్లో ట్రాక్టర్, వరీ కోత మిషన్ల బ్యాటరీలను అపహరించానని చెప్పాడు. వెంటనే మంగువాయిబడువ గ్రామం వెళ్లి మిగతా ఆ నలుగురుని పట్టుకొని వారి వద్ద నుంచి మోటార్ సైకిల్, 3 బస్తాల వరి ధాన్యం, 5 బ్యాటరీలను స్వాధీనం చేసుకొన్నామని, ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

స్నేహితులతో కలిసి కేటీపీఎస్ కాల్వలో ఈతకు వచ్చి యువకుడు మృతి



అజయ్ మృతదేహం

పాల్వంచ: స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వచ్చిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం మేరకు.. లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీకి చెందిన బోడ హత్తిరాం కుమారుడు అజయ్ (18) కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో చదువుతున్నాడు. శనివారం అదే గ్రామానికి చెందిన బానోతు విష్ణువర్ధన్, భూక్యా శశాంక్‌తో కళాశాలకు అని చెప్పి వెళ్లారు. మధ్యాహ్నం ముగ్గురు కలిసి పాల్వంచ శివారులోని కేటీపీఎస్ కాల్వలో ఈత కోసం వచ్చారు. అక్కడ ఈతకు దిగిన కొద్ది సేపటికి లోతు ఎక్కువగా ఉండటంతో అజయ్ నీళ్లలో మునిగాడు. తోటి స్నేహితులు చాలా శ్రమించి అతడిని బయటకు తీశారు. అప్పటికే అజయ్ అపస్మారక స్థితికి వెళ్లి మృతి చెందాడు. అజయ్ తండ్రికి విషయం చెప్పడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పోలీసులు సైతం పరిశీలించారు. హత్తిరాం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విప్లవ విజయం ఘనత లెనిన్‌దే..

శతజయంతి సభలో ఓయూ ప్రొఫెసర్ కాసీం



మాట్లాడుతున్న ఓయూ ప్రొఫెసర్ కాసీం

ఇల్లెందు: ప్రపంచంలో సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి విప్లవ విజయాన్ని సాధించగలిగింది లెనిన్ మాత్రమేనని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం తెలిపారు. ఇల్లెందులో శనివారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన నిర్వహించిన లెనిన్ శత జయంతి సభలో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. రెండో ప్రపంచ యుద్ధం ముగింపు చైనా విప్లవ విజయానికి దారి తీయగా.. దీన్ని అర్థం చేసుకున్న లెనిన్ చేసిన సూచనలు పాటించడంతో విప్లవం విజయవంతమైందని తెలిపారు. అయితే, వందేళ్లు దాటినా భారతదేశంలో విప్లవం ఎందుకు విజయవంతం కావడం లేదో అందరూ ఆలోచించాలని సూచించారు. గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, ఎన్డీ నాయకులు ఆవునూరి మధు, బండారి ఐలయ్య, తుపాకుల నాగేశ్వరరావు, యాకన్న, సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు, పూనెం రంగయ్య, డి.ప్రసాద్, నరేష్, బట్టు ప్రసాద్ పాల్గొన్నారు.

కేసు నమోదు

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ గేట్ వద్ద పార్కింగ్ చేసిన మోటార్ సైకిల్ చోరీకి గురైంది. భద్రాచలం పట్టణానికి చెందిన మహేశ్‌బాబు సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన తాళ్లగొమ్మూరు ఈస్ట్‌గేట్ వద్ద మోటార్ సైకిల్‌ను పార్కింగ్ చేసి విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం లంచ్‌కు వెళ్లేందుకు బయటకు వచ్చి చూస్తే మోటార్‌సైకిల్ కనిపించలేదు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు డ్రైవర్‌పై...

పాల్వంచరూరల్: బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంపై ఆర్‌టీసీ బస్సుడ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో శుక్రవారం రాత్రి భద్రాచలానికి చెందిన మేక సూర్యనారాయణ, అతని స్నేహితుడు సంపత్‌తో కలిసి పాల్వంచ నుంచి భద్రాచలానికి కారులో వెళ్తుండగా నాగారం కాలనీవద్ద భద్రాచలం డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతిన్నదని బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బస్సుడ్రైవర్ ఏవీ నారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థుల అదృశ్యం

కొత్తగూడెంటౌన్: పాఠశాలకు వెళ్తున్నాని ఒకరు, ఇంటికి వెళ్లి వస్తానని ఇంకో విద్యార్థి కనరాకుండా పోవడంతో కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పాత కొత్తగూడెంలోని జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదు వుతున్న అశ్వాపురం మండలం చింతిరియాల్‌కు చెందిన రిమాలి ఉషోదయ అక్షయ్‌కుమార్ శుక్రవారం సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అలాగే, కొత్తగూడెం సన్యాసిబస్తీకి చెందిన కుడుముల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి స్థానిక శివశివాని పాఠశాలలో 10వ తరగతి చదువుతుండగా, శుక్రవారం నుంచి ఇంటికి రాలేదు. ఈ మేరకు వారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు.

వాహనాల పట్టివేత

భద్రాచలంఅర్బన్: దుమ్ముగూడెం మండలం సుబ్బారావుపేట నుంచి గన్నవరం, నెమలికి నాలుగు పశువులు (రెండు ఆవులు, రెండు ఎద్దులు) తరలిస్తుండగా భద్రాచలం పోలీసులు శనివారం పట్టుకున్నారు. అంతేకాకుండా ఆంధ్రా సరిహద్దు నెల్లిపాక నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 29 పశువులను తరలిస్తున్న వాహనం (టీఎస్ 07 యూకే 4461)ను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పశువులను పాల్వంచ గోసంరక్షణ సమితికి అప్పగించి, తరలిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సొసైటీ క్రీడా పోటీల్లోనూ ద్వితీయ స్థానమే



ఉట్నూరు జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కిన్నెరసానిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో భద్రాచలం ఐటీడీఏ పరిధి ద్వితీయ స్థానంలో నిలిచారు. దీంతో ఉట్నూరులో జరిగిన సొసైటీ క్రీడోత్సవాల్లోనైనా మరింత ప్రతిభ చాటుతారని అంతా భావించినా అక్కడా ద్వితీయ స్థానమే దక్కింది. ఉట్నూరులో ఈనెల 17 నుంచి శనివారం వరకు సొసైటీ క్రీడాపోటీలు జరుగగా భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల నుంచి 130 మంది విద్యార్థులను తీసుకెళ్లారు. ఈ పోటీల్లో అండర్- 17 విభాగం బాలుర వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. ఇక అండర్-19 వాలీబాల్‌లో ద్వితీయ, అండర్-14 బాలికల విభాగంలో ద్వితీయ స్థానం, కబడ్డీ పోటీలో అండర్ 19, 17, 14 బాలుర విభాగాల్లో తృతీయస్థానంతో సరిపెట్టుకున్నారు. అలాగే, ఖోఖో పోటీల్లో అండర్-14లో ప్రథమ, అండర్-17లో ద్వితీయ, అండర్ 17, 14 బాలికల విభాగాల్లో ద్వితీయ, చదరంగం పోటీలో అన్ని విభాగాల్లో బాలికలు తృతీయస్థానాన్ని కై వసం చేసుకున్నారని ఐటీడీఏ క్రీడల అధికారి బి.గోపాల్‌రావు తెలిపారు.

కాగా, భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో వరుసగా మూడు సార్లు చాంపియన్లుగా నిలిచినా కిన్నెరసాని, ఉట్నూరులో జరిగిన పోటీల్లో ద్వితీయస్థానానికి పరిమితం కావడం చర్చనీయాంశమైంది. అయితే, ఇంటర్ చదివే వారిలో క్రీడాకారులు లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని అధికారులు చెబుతున్నారు. ఈమేరకు పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థులను గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, పీడీలు అభినంధించారు.

అర్బన్ పార్క్‌కు మరిన్ని హంగులు

పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ



పార్క్‌లో పరిశీలిస్తున్న పీసీసీఎఫ్, అధికారులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం సుభాష్‌నగర్, బాలాజీనగర్ గ్రామపంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన అటవీ శాఖ అర్బన్ పార్క్‌కు మరింతగా తీర్చిదిద్దాలని పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ సూచించారు. సీసీఎఫ్ భీమానాయక్‌తో కలిసి ఆమె పార్క్‌ను తనిఖీ చేశారు. పార్క్‌లో నాటిన మొక్కలు, ప్రజలకు ఆహ్లాదం అందించేలా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. పార్క్‌లో ఏర్పాట్లు బాగున్నప్పటికీ మరిన్ని హంగులు కల్పించడం ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ కృష్ణాగౌడ్, ఎఫ్‌డీఓ కర్ణావత్ వెంకన్న, ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు, డీఆర్ఓ సాల్మన్‌రాజ్, ఎఫ్‌బీఓ ఈరూలాల్ తదితరులు పాల్గొన్నారు.

హ్యుండాయ్ నూతన మోడల్ కారు విడుదల



కారును విడుదల చేస్తున్న డీఎస్పీ రెహమాన్, తదితరులు

చుంచుపల్లి: హ్యుండాయ్ కంపెనీ నూతనంగా రూపొందించిన న్యూ క్రెటా కారును శనివారం విద్యానగర్‌లోని భారత్ హ్యుండాయ్ షోరూంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ పెద్దన్నకుమార్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శబరీనాథ్ కారు ప్రత్యేకతలను వివరించారు. చుంచుపల్లి ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, షోరూం మేనేజర్ సాయికుమార్, వాసిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.